నమస్తే తెలంగాణ
# కామారెడ్డి
5 | నిజామాబాద్, బుధవారం 4 సెప్టెంబర్ 2024 | KAMAREDDY

**కరువు ఛాయలను దాటేసిన అనేక మండలాలు**
**'లోటు' తీర్చేసిన భారీ వానలు**
**నిజామాబాద్‌లో 29.3, కామారెడ్డిలో 20.7శాతం అధిక వర్షపాతం**



నిండుగా ప్రవహిస్తున్న పాల్వంచ వాగు



పొంగి ప్రవహిస్తున్న పోచారం ప్రాజెక్టు

# 3 నెలల వాన.. రోజుల్లో

## వార్షిక వర్షపాతానికి చేరువలో ఉమ్మడి జిల్లా

**వానలు దంచికొట్టాయి.** తాగు, సాగునీటికి ఏ 'లోటు' లేకుండా కుండపోత వర్షాలు పడ్డాయి. ఆగస్టు నెలంతా ముఖం చాటేసిన వరుణుడు.. సెప్టెంబర్ ఆరంభంతోనే దాడి చేశాడు. దీంతో ఉమ్మడి జిల్లాలో సగటు కంటే అత్యధిక వర్షపాతం నమోదైంది. మూడు నెలల్లో పడాల్సిన వానలు.. మూడు రోజుల్లోనే పడ్డాయి. ఫలితంగా కరువు ఛాయలు కనుమరుగయ్యాయి.

–నిజామాబాద్, సెప్టెంబర్ 3
(నమస్తే తెలంగాణ ప్రతినిధి)

**నిజామాబాద్‌లో 29.3శాతం అధికంగా..**

నిజామాబాద్ జిల్లాలోని 33 మండలాల్లో ప్రణాళికా విభాగం సేకరించిన గణాంకాల ప్రకారం.. 21 మండలాల్లో సగటు కంటే అత్యధికంగా వర్షం కురిసింది. 12 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. నిజామాబాద్ జిల్లా వార్షిక సరాసరి వర్షపాతం 1015.9 మిల్లీ మీటర్లు కాగా, జూన్ 1 నుంచి ఇప్పటివరకు 919 మి..మీ వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లో కురవాల్సిన సరాసరి వర్షం 710 మి.మీటర్లుగా ఉంది. మొత్తంగా 29.3శాతం అధికంగా నిజామాబాద్ జిల్లాలో నమోదైంది. గడిచిన నాలుగైదు రోజుల్లోనే ఇది చోటు చేసుకోవడం గమనార్హం. ఆగస్టు చివరిదాకా సగానికంటే ఎక్కువ మండలాలు లోటు వర్షపాతంతోనే కొట్టుమిట్టాడాయి. కొన్ని మండలాల్లో దుర్భర పరిస్థితులు తలెత్తగా, సెప్టెంబర్ నెలారంభంతో కరువు తీరా వానలు పడ్డాయి. నవీపేటలో ఆల్‌టైం రికార్డుగా 96.1శాతం అధిక వర్షపాతం నమోదైంది. ఏర్గట్లలో 59.4, మెండోరాలో 58.1, ముప్కాల్‌లో 56 శాతం అధికంగా వానలు కురిశాయి. మోపాల్, రుద్రూర్, నిజామాబాద్ రూరల్, డిచ్‌పల్లి, డొంకేశ్వర్, కోటగిరి మండలాల్లో సాధారణ వర్షం కురిసింది.

**కామారెడ్డిలో 20.7శాతం ఎక్కువగా..**

కామారెడ్డి జిల్లాలోని 24 మండలాల్లో ఇప్పటి వరకు 672 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. వార్షిక వర్షపాతం 996.7మి.మీటర్లు కాగా, ఇప్పటికే 20.7శాతం అధిక వర్షపాతం రికార్డు అయింది. మరికొద్ది రోజులు భారీ వానలు కురిస్తే ఈ సీజన్‌లోనే వార్షిక వర్షపాతాన్ని కామారెడ్డి జిల్లా చేరుకోనుంది. భిక్కనూర్‌లో 66.9, నస్రుల్లాబాద్‌లో 60.2, సదాశివనగర్‌లో 60.7శాతం చొప్పున అత్యధిక వర్షపాతం నమోదైంది. పెద్దకొడప్‌గల్, పిట్లం, నిజాంసాగర్, ఎల్లారెడ్డి, బీబీపేట మండలాల్లో సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షపాతం నమోదు కావడం ఆశ్చర్యానికి గురి చేస్తున్నది. 13మండలాల్లో కురిసిన వానలు ఫర్వా లేదనిపించగా, 8 మండలాల్లో అధిక వర్షపాతం, 3 మండలాల్లో అత్యధిక వానలు కురిసినట్లుగా గణాంకాలు చెబుతున్నాయి. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఆగస్టు నెలలో 44శాతం లోటు వర్షపాతం ఉండగా, మూడు రోజుల్లో కురిసిన వానలతో అధిక వర్షపాతం నమోదైంది.

**పంటలకు ఢోకా లేనట్లే..**

భారీ వానలతో వందలాది చెరువులు అలుగులు పారుతున్నాయి. గోదావరి, మంజీరా నదులు ఉప్పొంగుతున్నాయి. కరువుతీరా పడిన ఈ వానలతో రైతాంగంలో హుషారు కనిపిస్తున్నది. చెరువులు నిండుకుండలా మారడంతో యాసంగి సాగుకు ఢోకా లేదని రైతులు సంబురపడుతున్నారు. అయితే, పంటల ఎదుగుదల దశలో ఏకదాటి వానలతో కొంత ఆందోళన చెందుతున్నారు. పంటలు దెబ్బతింటాయేమో? అన్న భయంతో బిక్కుబిక్కుమంటున్నారు. వరుణదేవా.. ఇక వర్షం చాలించు అంటూ ప్రార్థిస్తున్నారు.

**మొదట్లో అంతంతే..**

వానకాలం ఆరంభంలో పెద్దగా వర్షాలు పడలేదు. జూన్ నెలంతా ఎండాకాలాన్ని తలపించినప్పటికీ మోస్తరు వానలు కురిశాయి. జూలైలో ఫర్వాలేక పోయినా ఆగస్టులో మాత్రం అంతంతే పడ్డాయి. అయితే, సీజన్ చివరి మాసంలో మాత్రం కుండపోత వానలు కురిశాయి. అతి భారీ వర్షాలతో లోటు వర్షపాతం లేకుండా పోయింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూడు రోజుల్లో రికార్డు స్థాయిలో భారీ వర్షపాతం నమోదైంది. ఆగస్టు నెలలో ఏర్పడిన లోటు వర్షపాతం.. సెప్టెంబర్ నెల మొదటి రెండ్రోజుల్లోనే కురిసిన వర్షాలతో లోటు లేకుండా పోయింది.

కందకుర్తి వద్ద వంతెనకు ఆనుకొని ప్రవహిస్తున్న గోదావరి

# ఇదెక్కడి దౌర్జన్యం

- సామగ్రి బయటపడేసి.. బలవంతంగా ఖాళీ చేయించిన అధికారులు
- వర్షంలో ఎక్కడకు వెళ్లాలని లబ్ధిదారుల వాగ్వాదం

**డబుల్ బెడ్రూం ఇండ్లలో ఉంటున్న వారి గెంటివేత**



ఇండ్లు ఖాళీ చేయిస్తున్న అధికారులతో వాగ్వాదానికి దిగిన లబ్ధిదారులు

భిక్కనూరు, సెప్టెంబర్ 3: మండలంలోని బస్వాపూర్‌లో గల డబుల్ బెడ్రూం ఇండ్లలో నివాసముంటున్న వారిపై అధికారులు, పోలీసులు మంగళవారం జులుం ప్రదర్శించారు. అక్రమంగా నివాసముంటున్నారని చెబుతూ బలవంతంగా ఖాళీ చేయించారు. ఇండ్లల్లో ఉన్న సామగ్రిని బయట పడేసి, గదులకు తాళాలు వేశారు. మరోసారి ఇటు వైపు వస్తే కేసులు పెట్టి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. ఇదేమి దౌర్జన్యమని, జోరుగా వర్షాలు కురుస్తున్న వేళ ఉన్నఫళంగా వెళ్లిపోవాలంటే తాము ఎక్కడకు వెళ్లాలంటూ లబ్ధిదారులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. కేసీఆర్ హయాంలో బస్వాపూర్ గ్రామ శివారులో 50 డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించారు. ఆ సమయంలో బస్వాపూర్ గ్రామంలో కలిసి ఉన్న సిద్ధరామేశ్వర్‌నగర్ కాలనీ ఆ తర్వాత గ్రామంగా ఏర్పడడంతో, రెండు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి బస్వాపూర్ వాసులకు 41, సిద్ధరామేశ్వర్‌నగర్ కాలనీ వాసులకు 9 ఇండ్ల కేటాయించాలని తీర్మానించారు. ఈ నేపథ్యంలో అధికారులు లబ్ధిదారులను ఎంపిక చేయగా, నాటి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ వారికి ఇండ్లను కేటాయిస్తూ అక్టోబర్ 7, 2023 రోజున ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, లాటరీ ద్వారా ఇండ్లను కేటాయించాల్సి ఉండగా, ఎలక్షన్ కోడ్ రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. ఎన్నికలు పూర్తయి, ఎనిమిది నెలలు గడుస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం లబ్ధిదారులకు ఇండ్లు కేటాయించలేదు. మరోవైపు, ఉండేందుకు జాగా లేక ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు ఇటీవల డబుల్ ఇండ్లలోకి వచ్చి నివాసముంటున్నారు.

అయితే, మంగళవారం ఆర్డీవో రంగనాథ్, తహసీల్దార్ శివప్రసాద్, రెవెన్యూ, పోలీసు సిబ్బంది వచ్చి లబ్ధిదారులను బలవంతంగా ఖాళీ చేయించారు. వర్షాలు పడుతున్న సమయంలో తాము ఎటు పోవాలని లబ్ధిదారులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. మరోవైపు, ఈ ఘటనపై మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ అధికారికంగా లబ్ధిదారుల జాబితా విడుదల చేసిన తర్వాత ఇప్పటికీ ఇండ్లు ఇవ్వకుండా లబ్ధిదారులను ఇబ్బందులు గురి చేస్తున్నారని మండిపడ్డారు. ఉన్న ఫళంగా ఖాళీ చేయిస్తే వారు ఎక్కడకు పోవాలని గంప గోవర్ధన్ ప్రశ్నించారు.

## సిరికొండ ఎఫ్ఆర్వో సస్పెన్షన్

వినాయక్‌నగర్ / సిరికొండ, సెప్టెంబర్ 3: అటవీ భూమిని కబ్జా చేసి సాగుచేస్తున్నా నిర్లక్ష్యం వహించడం, కబ్జాకు పాల్పడిన వారి నుంచి ముడుపులు తీసుకున్న సిరికొండ ఎఫ్ఆర్వో ఎం.వినయ్ నాయక్‌పై వేటు పడింది. ఆయనను సస్పెండ్ చేస్తూ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఆర్ఎం. డోబ్రియల్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. సిరికొండలో అటవీ భూములను కొంతమంది దున్నుకుంటూ సాగు చేస్తున్నారని రెండు, మూడు నెలల క్రితం గ్రామస్తులు సిరికొండ ఎఫ్ఆర్వోకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై నిర్లక్ష్యం వహించడంతోపాటు కబ్జాకు పాల్పడిన వారి నుంచి ముడుపులు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎఫ్ఆర్వో నిర్వాకంపై అటవీ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందడంతో పూర్తి స్థాయి విచారణకు ఆదేశించారు. ఆర్మూర్ ఫారెస్టు డివిజన్ ఆఫీసర్ భవానీశంకర్‌తో పాటు స్పెషల్ పార్టీతో విచారణ కమిటీ నియమించారు. క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టిన కమిటీ.. సిరికొండ ఎఫ్ఆర్వో ఎం.వినయ్ నాయక్‌పై వచ్చిన ఆరోపణలు వాస్తవమేనని తేల్చడంతో ఆయనపై వేటు వేశారు.

## చేపల కోసం వెళ్లి గల్లంతు..

మోర్తాడ్, సెప్టెంబర్ 3: మోర్తాడ్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న మొండివాగులో పడి ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. ఎస్సై విక్రమ్ కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లా మద్నూర్‌కు చెందిన గైచోడ్ సురేశ్ (40) వ్యవసాయ కూలీ పనులు చేయడానికి మోర్తాడ్‌కు వచ్చి కొంతకాలంగా ఇక్కడే ఉంటున్నాడు. మంగళవారం సాయంత్రం మొండివాగులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కా రణంగా మొండివాగు ఉధృతంగా ప్రవహిస్తుండగా, సురేశ్ కాలుజారి వాగులో పడి గల్లంతయ్యాడు. ఆయన కోసం గాలింపు చర్యలు చేపట్టారు.


## జాలరి మృతదేహం లభ్యం

మాచారెడ్డి, సెప్టెంబర్ 3: ఎగువ మానేరు ప్రవాహంలో గల్లంతైన జాలరి మృతదేహమై తేలాడు. మాచారెడ్డి ఎస్సై అనిల్ కథనం ప్రకారం.. మాచారెడ్డి మండలం లచ్చాపేట గ్రామానికి చెందిన కైరంకొండ శివరాములు (55) స్థానికంగా ఉన్న వాగులో ఆదివారం చేపల వేటకు వెళ్లి వరద ఉధృతికి గల్లంతైన సంగతి తెలిసిందే. రెండ్రోజుల నుంచి ఆయన కోసం గాలిస్తున్నా ఆచూకీ దొరకలేదు. మంగళవారం గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టగా, మృతదేహం లభ్యమైంది. కేసు నమోదు చేసిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కామారెడ్డి దవాఖానకు తరలించారు.

# నిజాంసాగర్‌కు భారీ వరద

**నేడో, రేపో గేట్లు ఎత్తే అవకాశం**

**ఎస్సారెస్పీకి 2.45 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో**



నిజాంసాగర్/మోర్తాడ్, సెప్టెంబర్ 3: ఉమ్మడి జిల్లా వరప్రదాయిని నిజాంసాగర్‌లోకి భారీగా వరద వస్తున్నది. మంగళవారం సాయంత్రానికి 34,400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతున్నది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1405.00 అడుగుల (17.802 టీఎంసీలు)కు గాను మంగళవారం సాయంత్రానికి 1401.66 అడుగుల (13.270 టీఎంసీలు) మేర నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు ఏఈ శివప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. వరద ఇలాగే కొనసాగితే బుధ లేదా గురువారం నాటికి గేట్లు ఎత్తే అవకాశం ఉంది.

**ఎస్సారెస్పీకి తగ్గని వరద**

నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు వరద ప్రవాహం కొనసాగుతున్నది. ఎగువ నుంచి 2.40 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండడంతో అంతే మొత్తంలో నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా, మంగళవారం రాత్రి 9 గంటలకు 1088 అడుగుల (70.140 టీఎంసీలు) మేర నీటి నిల్వ కొనసాగిస్తూ, మిగులు జలాలను విడిచి పెడుతున్నారు. 41 గేట్లు ఎత్తి 2.15 లక్షల క్యూసెక్కులను దిగువ గోదావరికి వదులుతుండగా, వరద కాలువకు 17 వేలు, కాకతీయ కాలువకు 4 వేలు, ఎస్కేప్ గేట్ల ద్వారా 4 వేలు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు దిగువన గల జల విద్యుదుత్పత్తి కేంద్రంలోని నాలుగు టర్బయిన్ల ద్వారా 36 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతున్నట్లు జెన్‌కో అధికారులు తెలిపారు.

**పొలాలను ముంచెత్తిన ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్**

నవీపేట, సెప్టెంబర్ 3: మండలంలోని మిట్టాపూర్ శివారులోని వందలాది ఎకరాల పంట నీట మునిగింది. శ్రీరాంసాగర్ బ్యాక్ వాటర్ ముంచెత్తడంతో వరి పైర్లు పూర్తిగా మునిగి పోయాయి. మహారాష్ట్ర ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరికి వరద పోటెత్తింది. మండలంలోని యంచ, నందిగామ, మిట్టాపూర్, కోస్లీ,బినోలా తదితర గ్రామాలకు చెందిన పంట పొలాలను శ్రీరాంసాగర్ బ్యాక్ వాటర్ ముంచెత్తింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న ప్రశాంత్‌కాలనీ వాసులు

## నీటి గోస తీర్చాలని జీపీ ముట్టడి

బిచ్కుంద, సెప్టెంబర్ 3 : ఓవైపు వర్షాలు దంచికొడుతుంటే, మరోవైపు తాగునీళ్లు లేక అవస్థలు పడుతున్నామని కామారెడ్డి జిల్లాలోని బిచ్కుంద పంచాయతీ కార్యాలయాన్ని మంగళవారం ముట్టడించారు. ప్రశాంత్ కాలనీతోపాటు ఇతర వార్డుల ప్రజలు జీపీ ఆఫీస్ ఎదుట ఖాళీ బిందెలతో బైఠాయించారు. నెల రోజుల నుంచి మిషన్ భగీరథ నీరు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. సెక్రటరీ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఎంపీవో అబ్బాగౌడ్ అక్కడకు చేరుకోగా, కాలనీవాసులు ఆయనను చుట్టుముట్టారు. రోజులు గడుస్తున్నా నీటి సమస్యను ఎందుకు పరిష్కరించరని నిలదీశారు.

## మీడియేషన్ సెంటర్‌లో ఉచిత సేవలు



మీడియేషన్ సెంటర్ ప్రారంభించిన అనంతరం మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీత

**జిల్లా జడ్జి సునీతా కుంచాల**

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబర్ 3: రాజీ పడదగిన కేసులను పరిష్కరించేందుకే జిల్లాలో కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు జిల్లా జడ్జి సునీతా కుంచాల తెలిపారు. ఆర్మూర్‌లోని మేరుసంఘ భవన్‌లో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్‌ను ఆమె మంగళవారం ప్రారంభించారు. అనంతరం న్యాయమూర్తి సునీత మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో ప్రజలు తమ కుటుంబాలు, వ్యాపారాలలో జరిగే చిన్న చిన్న సమస్యలతో, పగలు, ప్రతీకారాలతో కోర్టులు, పోలీసుస్టేషన్ల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బును వృథా చేసుకుంటున్నారని తెలిపారు. కుటుంబ సభ్యులతో, ఇతరులతో వివాదాలు పెట్టుకుని ఒంటరి జీవితం గడుపుతున్నారన్నారు. అలాంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసమే కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాజీ పడదగిన కేసులను ఈ సెంటర్లలో ఎలాంటి ఫీజులు లేకుండా కౌన్సెలింగ్ ఇచ్చి చట్టరీత్యా పరిష్కరించనున్నట్లు వివరించారు. ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆర్మూర్ సీనియర్ జడ్జి నసీం సుల్తానా, ఆర్మూర్ జూనియర్ సివిల్ జడ్జి దీప్తి, ఆర్డీవో రాజాగౌడ్, డీసీపీ బస్వారెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సయ్య పాల్గొన్నారు.

**నేను సైతం..**




తన కిడ్డీ బ్యాంకులో దాచుకున్న రూ.3 వేలను ముంపు బాధితుల కోసం మహబూబాబాద్‌లో సీఎం సహాయనిధికి అందిస్తున్న పదో తరగతి విద్యార్థిని ముత్యాల సాయిసింధు. ఆమెను సీఎం రేవంత్, మంత్రులు అభినందించారు.

## శిశువు మృతి ఘటనపై పోలీసు కేసు

బాన్సువాడ, సెప్టెంబర్ 3: బాన్సువాడ మాతా శిశు సంరక్షణ కేంద్రంలో నవజాత శిశువు మృతి చెందిన ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పాత వర్నికి చెందిన గర్భిణి సోనీకి వైద్యులు సోమవారం సాయంత్రం సిజేరియన్ చేయగా, మగ శిశువు మృతి చెందిన సంగతి తెలిసిందే. అయితే, వైద్యుల నిర్లక్ష్యం వల్లే తమ బిడ్డ చనిపోయాడని ఆవేదనకు గురైన కుటుంబ సభ్యులు మంగళవారం దవాఖానలో డాక్టర్లతో వాగ్వాదానికి దిగారు. అనంతరం నేరుగా పట్టణ పోలీసుస్టేషన్‌కు వెళ్లి డాక్టర్లపై ఫిర్యాదు చేశారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే తమ బిడ్డ మృతి చెందాడని సోనీ భర్త అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ మున్నూరు కృష్ణ తెలిపారు. నవజాత శిశువు మృతికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టి, తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

# వృద్ధుడి వద్దకే వచ్చి విచారణ

- సాక్షిగా కోర్టుకు వచ్చిన పెద్దాయన
- నడవలేని స్థితిలో ఉన్న వృద్ధుడు
- స్వయంగా వచ్చి వివరాలు సేకరించిన జడ్జి



వృద్ధుడి వద్దకు వచ్చి వివరాలు తెలుసుకుంటున్న న్యాయమూర్తి సాయిశివ

శక్కర్‌నగర్, సెప్టెంబర్ 2: ఓ కేసులో సాక్ష్యం చెప్పేందుకు కోర్టుకు వచ్చాడో వృద్ధుడు. నడవలేని స్థితిలో ఉన్న ఆ పెద్దాయన కోర్టు హాల్‌లోకి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతుండడాన్ని గమనించిన న్యాయమూర్తి నేరుగా ఆయన వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. బోధన్ కోర్టులో మంగళవారం ఈ ఘటన చోటు చేసుకుంది. బోధన్ న్యాయస్థానంలో ఓ కేసు విచారణలో భాగంగా సాక్ష్యం చెప్పేందుకు అశోక్ మిర్యాల్‌కర్ అనే వృద్ధుడు కోర్టుకు వచ్చాడు. కోర్టు మెట్లు ఎక్కి హాల్‌లోకి వెళ్లలేని స్థితిలో ఉన్న ఆయనను అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఇసంపల్లి సాయిశివ గమనించారు. బయట హాలులో ఉన్న ఆ పెద్దాయన వద్దకు వచ్చి.. కేసుకు సంబంధించిన వివరాలు నమోదు చేసుకున్నారు. న్యాయమూర్తి మానవతా దృక్పథంతో కోర్టు బెంచ్ నుంచి దిగి వచ్చి వృద్ధుడితో మాట్లాడిన తీరుపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

